క్లుప్తంగా

దీపావళి శుభాకాంక్షలు



పులివెందుల రూరల్ : కడప జిల్లా ప్రజలకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం దీపావళి పండుగను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. ఈ దీపావళి ప్రజల జీవితాలలో వెలుగులు నింపాలని ఆయన ఆకాంక్షించారు. చిన్నపిల్లలు టపాసులను కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. పెద్దవారు పిల్లలచే టపాసులు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు, సూచనలు తెలియజేయాలన్నారు. జిల్లాలోని ప్రజలందరూ దీపావళి పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

సర్వర్ పనిచేయక అవస్థలు



ఆధార్ కేంద్రంలో సర్వర్ పనిచేయక అవస్థలు పడుతున్న సిబ్బంది

పులివెందుల రూరల్ : పట్టణంలోని ఆధార్ అప్‌డేట్, పేరు మార్పులు, చేర్పులు చేసుకోవచ్చునని రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల్లో ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీంతో ప్రజలు ఆధార్ అప్‌డేట్ చేయించుకునేందుకు సచివాలయాలకు వెళితే అక్కడ సిబ్బంది లేక, సర్వర్లు పనిచేయక గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. సచివాలయాల్లో సిబ్బంది లేకపోవడంతో అక్కడ ఉన్న వారే ఆధార్ సేవలతోపాటు మిగిలిన సేవలు చేయాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రజలు ఇబ్బందులు పడకుండా ఆధార్ కేంద్రాలను పెంచే విధంగా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ఉపాధి పనుల నాణ్యత పరిశీలన



మట్టి రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న ఉపాధి అధికారులు

సింహాద్రిపురం : మండలంలోని గురిజాల, కసనూరు, హిమకుంట్ల, అంకాలమ్మ గూడూరు గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఉపాధి పనుల కింద చేపట్టిన మట్టి రోడ్లు, ఫారంపాండ్స్ పనులకు క్వాలిటీ కంట్రోల్ అధికారులు విజయభాస్కర్, మధులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు గుంతల నాణ్యతలను, కొలతలను పరిశీలించి ఉపాధి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధి ఈసీ శ్రీనివాసరెడ్డి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రాణాంతక వ్యాధులపై అవగాహన



ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తొండూరు : మండలంలోని భద్రంపల్లి గ్రామంలో బుధవారం టైఫాయిడ్, డెంగీ, మలేరియా, ఇతర వైరల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని తొండూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి జ్వరం లక్షణాలు, రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఉచిత మందుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ లక్ష్మీప్రసన్న, ఎఎన్ఎం సహనాజ్, ఆశావర్కర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక నృత్యాలు



ముందస్తు దీపావళి వేడుకలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

వేంపల్లె : స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. బుధవారం పాఠశాల ఆవరణలో ముందస్తు దీపావళి పండుగ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు వివిధ నృత్య ప్రదర్శనలు, ప్రసంగాలు చేశారు. దీపావళి పండుగను తమ కుటుంబ సభ్యుల మధ్య సంతోషంగా జరుపుకోవాలని కరెస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు.

వెంకటనారాయణకు డాక్టరేట్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పరిశోధకులు తమ్మిశెట్టి వెంకటనారాయణకు వైవీయూ డాక్టరేట్ ప్రదానం చేశారు. వై వీ యూ తెలుగుశాఖ ఆచార్యులు ఎం.ఎం.వినోదిని పర్యవేక్షణలో 'తెలుగులో గ్రామిక కథలు స్త్రీ చైతన్యం (1980 నుంచి 2015 వరకు)' అనే అంశంపై ఈయన చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వైవీయూ పరీక్షల నిర్వహణాధికారి ఆచార్య కెఎస్వీ కృష్ణారావు తెలిపారు.

అంగన్‌వాడీలకు అందని పుస్తకాలు

అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల భవితను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలను పునఃప్రారంభించి నెలలు గడుస్తున్నా పాఠ్య పుస్తకాలు సరఫరా చేయకుండా మీనమేషాలు లెక్కిస్తోంది. పాత పుస్తకాలతోనే బోధన కొనసాగించాల్సిన దుస్థితి నెలకొంది.

- పాత పుస్తకాలతో నెట్టుకొస్తున్న వైనం
- కేంద్రాలపై ప్రభుత్వం ఉదాసీనత
- గత ప్రభుత్వ పాలనలో సత్ఫలితాలు



అంగన్‌వాడీ కేంద్రంలో పాత పుస్తకాలతోనే చిన్నారులకు బోధిస్తున్న అంగన్‌వాడీ టీచర్

ఎర్రగుంట్ల : ముద్దనూరు సీడీపీఓ పరిధిలోని ఎర్రగుంట్ల, కొండాపురం, ముద్దనూరు మండలాలలో 164 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో ఎర్రగుంట్ల మండలంలో 66, ముద్దనూరు మండంలలో 46, కొండాపురం మండలంలో 52 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. బాల్య దశలో విజ్ఞానం పెంపొందించడంతో పాటు ఆంగ్లమాధ్యమంలో చిన్నారులు పట్టు సాధించేలా వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల విషయంలో తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణలు సత్ఫలితాలనిచ్చాయి. ఈ కేంద్రాల చిన్నారులకు ఆటపాటలతో కూడిన నాల్గు పుస్తకాలు బర్డ్స్–1, కిట్లను అందజేసింది. వీటివల్ల ప్రైవేటు కార్పొరేట్ స్కూళ్లకు ఏ మాత్రమూ తగ్గ కుండా అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ ఇంగ్లిష్‌లో విద్యాబోధన చేసేవారు. ఫలితంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు సంఖ్య గణనీయంగా పెరిగింది. రెండు నుంచి నాలుగేళ్లలోపు చిన్నారులకు ఇంగ్లిష్, గణితం, స్పోకెన్ ఇంగ్లిష్, యాక్టివిటి డ్రాయింగ్స్ సంబంధించిన ఐదు పుస్తకాలతో కూడిన అంగన్‌వాడీ చిన్నారులకు పాఠాలు చెబుతున్న టీచర్ (ఫైల్) పీపీ–1 కిట్లు, నాలుగేళ్ల నుంచి ఐదేళ్ల చిన్నారులకు ఐదు పుస్తకాలతో కూడిన పీపీ–2 కిట్లు అందజేసింది. ఇవన్నీ మంచి ఫలితాలు ఇచ్చాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం అమలు చేసిన సంస్కరణలకు మంగళం పాడింది. అంగన్‌వాడీ కేంద్రాలకు పాఠ్య పుస్తకాల పంపిణీని పూర్తిగా నిలిపివేసింది.

పాత పుస్తకాలతో..

కొంతమంది అంగన్‌వాడీ వర్కర్లు పాత పుస్తకాలతో బోధన కొనసాగిస్తున్నారు. చిన్నారులకు ఆయా పుస్తకాల్లోని బొమ్మలను చూపించి అర్థమయ్యే విధంగా వివరిస్తూంటే వారికి చక్కని విషయ పరిజ్ఞానం పెంపొందించేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వం నిర్లక్ష్యంతో పుస్తకాల పంపిణీ ఆగిపోయి తమ చిన్నారుల భవితకు అవరోధంగా మారిందని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు.

పుస్తకాలు త్వరలో వస్తాయి

పుస్తకాలు త్వరలో వస్తాయని వచ్చిన తర్వాత వాటిని పంపిణీ చేస్తాం. ప్రస్తుతం అంగన్‌వాడీ వర్కర్లు పాత పస్తకాలతోనే విద్యాబోధన చేస్తున్నారు. బోదనకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. త్వరలోనే చిన్నారులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

- ముంతాజ్‌బేగం, సీడీపీఓ ముద్దనూరు, ఐసీడీఎస్ శాఖ

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మ వ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఆపార్ వివరాలు నమోదుపై శిక్షణ



మాట్లాడుతున్న డీఈఓ మీనాక్షి

వేంపల్లె : విద్యార్థులకు అపార్ కార్డు వివరాల నమోదుపై అన్ని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల హెడ్ టీచర్లు, హెడ్మాస్టర్లకు ఆపార్ ఐడి జనరేట్‌పై సమావేశం నిర్వహించారు. ఆధార్ కార్డులో విద్యార్థుల వివరాలు తప్పొప్పులుంటే ఎలా నమోదు చేయాలనే విషయాలపై చర్చించారన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపార్ కార్డు అంటే ఆటోమేటిక్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ అంటారని.. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆపార్ కార్డు జారీ చేయనున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం అపార్ కార్డు పేరుతో వన్ నేషన్ వన్ ఐడి కార్డును అందుబాటులోకి తీసుకురానుందన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఈ గుర్తింపు కార్డును ఇచ్చే ప్రక్రియను త్వరితగతన ప్రారంభించాలని అన్ని రాష్ట్రాలకు కేంద్ర విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు జాఫర్ సాదిక్, స్టాలిన్ ఐజాక్, అన్ని ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్లు, ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్లు, హెడ్ టీచర్లు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ధన త్రయోదశి వేడుకలు



శ్రీవాసవీమాతకు పిండి వంటలను నైవేద్యంగా పెట్టిన భక్తులు

వేంపల్లె : స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో బుధవారం ధన త్రయోదశి పురస్కరించుకుని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి నేతృత్వంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో శ్రీ వాసవీమాతకు ఆర్యవైశ్య మహిళలు 108 రకాల పిండి వంటలు నైవేద్యంగా సమర్పించి అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు ప్రవీణ, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు హరికృష్ణ, ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీ వాసవీ కళ్యాణ మండపం, అవోపా, ఆర్యవైశ్య మహిళా మండలి, అవోపా మహిళా విభాగం, తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సర్దార్ పటేల్ అడుగుజాడల్లో నడవాలి



సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

వేంపల్లె : జాతీ సమైక్యత కోసం తనశక్తి సామర్థ్యాలను ధారపోసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ అడుగుజాడల్లో నడవాలని, దేశ ప్రగతికి బాటలు వేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఓబుల్‌రెడ్డి తెలిపారు. బుధవారం కళాశాల ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు సర్దార్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ యోగాంజనేయులు మాట్లాడుతూ జాతీయ సమైక్యత, దేశ స్థిరత్వాన్ని కాపాడటం, దేశ అభివృద్ధి చెందడం ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటాయన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందులలో వైఎస్సార్‌సీపీ నాయకుల సందడి



పులివెందులలో వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు

పులివెందుల రూరల్ : 2027లో జరిగే జమిలి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి అధికారంలోకి రావడం తథ్యమని, సీఎం సీఎం అంటూ క్యాంపు కార్యాలయం నినాదాలతో మారుమ్రోగిపోయింది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల పర్యటనలో భాగంగా రెండవ రోజు బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రజలతో మమేకమయ్యారు. జిల్లా నలుమూలల నుంచేకాక రాయలసీమ జిల్లాల్లోని వివిధ ప్రాంతాలనుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. కార్యకర్తలు, అభిమానులు ఆయనతో సెల్ఫీలు తీసుకుంటూ సీఎం సీఎం అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆయన వంద రోజుల కూటమి పాలనలో రాష్ట్రం అథోగతి పాలైందన్నారు. చెప్పిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ప్రజలపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్న చంద్రబాబుకు ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కావాలనే పులివెందుల మెడికల్ కళాశాలకు కేటాయించిన సీట్లను రద్దు చేయించారన్నారు.

యువత సమాజ సేవలో భాగస్వాములు కావాలి



రోగులకు వైద్య పరీక్షలు అందిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

పులివెందుల రూరల్ : యువత సమాజ సేవలో భాగస్వామ్యులు కావాలని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ మల్లీశ్వరి తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్ సర్వజన ప్రభుత్వాసుపత్రిలో నెహ్రూ యువ కేంద్రం, స్నేహిత అమృతహస్తం సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో దివాలి విత్ మై భారత్ కార్యక్రమంలో భాగంగా రోగులకు వైద్య సేవలు నిర్వహించారు. అనంతరం ఫుడ్ అండ్ సైన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు రోగులకు వివిధ రకాల సేవలను అందించారు. అనంతరం రోగులకు వారు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చే శారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నవీన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అ ధికారులు, నెహ్రూ యువ కేంద్రం వలంటీర్లు, హాండ్స్ ఫర్ యూ సుబ్బారావు, సేవా సమితి అధ్యక్షుడు రాజు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

దీపావళి సందడి



డిగ్రీ, పీజీ కళాశాలలో దీపాలు వెలిగిస్తున్న విద్యార్థులు

కమలాపురం : మండలంలో దీపావళి సందడి మొదలైంది. పట్టణంతో పాటు ప్రతి గ్రామంలో బా ణా సంచా పేల్చి పండుగ చేసుకోవడానికి ప్రజలు, చిన్నారులు సిద్ధం అయ్యారు. ఇప్పటికే కమలాపురం మార్కెట్ యార్డు గ్రౌండ్ నందు టపాసులు విక్రయ దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయాలు చేపట్టారు. బుధవారం చిన్నారులు వారి తల్లిదండ్రులతో టపాసులు కొనుగోలు చేయడానికి రావడంతో ఆ ప్రాంగణంలో సందడి కనిపించింది. ముఖ్యంగా చిన్న పిల్లలు సంతోషంగా జరుపుకునే పండుగల్లో దీపావళి ఒకటి. చిన్న పిల్లలతో పాటు తలిదండ్రులు కూడా బాణా సంచా పేల్చుతూ సంతోషంగా దీపావళి పండుగ జరుపుకోవడానికి సిద్ధం అయ్యారు.

నిబంధనలు పాటించి విక్రయాలు జరపాలి

టపాసుల దుకాణాదారులు ప్రభుత్వం విధించిన నిబంధనలను పాటించి టపాసులు విక్రయించాలని ఎస్ఎఫ్ఓ శివ శంకర్‌రెడ్డి తెలిపారు. టపాసులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. టపాసుల విక్రయాల్లో ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు.

పర్యావరణ హిత దీపావళి జరుపుకోవాలి

ప్రతి ఇంట్లో కుటుంబ సభ్యులందరూ కలసి మెలసి పర్యావరణ హిత దీపావళి పండుగను జరుపుకోవాలని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన కళాశాలలో ఎకో దీపావళి పేరుతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అండగా ఉంటా.. అందుబాటులో ఉంటా



సాయినాథ శర్మ వర్గీయులను భరోసా కల్పిస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

కమలాపురం : వైఎస్సార్ సీపీ పటిష్టత కోసం శక్తి వంచన లేకుండా కృషి చేసిన కమలాపురంకు చెందిన రాష్ట్ర నాయకుడు సాయినాథ శర్మకు, ఆయన వర్గీయులకు తాను ఎప్పటికి అండగా ఉండి, అందుబాటులో ఉంటానని మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గట్టి భరోసా ఇచ్చారు. పులివెందులలో బుధవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు సాయినాథ శర్మ, రెడ్యం వెంటకసుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో కమలాపురం నియోజకవర్గంలో ఇటీవల అధికార టీడీపీ నాయకులు పెట్టిన పోలీస్ కేసుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్న సాయినాథ శర్మ వర్గీయులను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా పిలిపించి వారితో వ్యక్తిగతంగా మాట్లాడి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారితో మాట్లాడుతూ మీపై హత్యాయత్నం, కిడ్నాప్ తదితర తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్న విషయాన్ని తాను గమనిస్తున్నానన్నారు. నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. మనం నిజాయితీగా ఉన్నప్పటికి అధికార పార్టీ అన్యాయాలకు, అరాచకాలకు పార్టీ కార్యకర్తలు బలైపోతున్నారన్నారు. పోలీసులు కూడా న్యాయ, అన్యాయాలు ఆలోచించి కేసుల విషయంలో నిర్ణయం తీసుకోవాలన్నారు. కొన్ని చోట్ల పోలీస్ అధికారులు అధికార పార్టీ నాయకుల చేతుల్లో కీలు బొమ్మలుగా మారారన్నారు. టీడీపీ నుంచి చివరి సమయంలో వైఎస్సార్ సీపీలో చేరిన సాయినాథ శర్మ వర్గీయులను కమలాపురం నియోజకవర్గంలో అధికార పార్టీ వారు ఇబ్బంది పెట్టడం ఏ మాత్రం భావ్యం కాదన్నారు. వైఎస్సార్ సీపీని తనను నమ్ముకుని తన మీద విశ్వాసంతో పార్టీలోకి వచ్చిన సాయినాథ శర్మ వర్గీయులందరికీ తాను ఎప్పటికీ అండగా ఉంటానని జగన్ స్పష్టం చేశారు.

రక్తహీనతపై మహిళలకు అవగాహన

లింగాల : స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు బుధవారం రక్తహీనతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి మాట్లాడుతూ రక్తహీనత నివారణ కోసం గర్భిణులు ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందే పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

లింగాల : ఇప్పట్ల వద్ద ఉన్న లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో బుధవారం లింగాల గ్రామానికి చెందిన అలవలపాటి పాపిరెడ్డి, అనంతమ్మల కుమార్తె అలవలపాటి మాధవీలత 15వ వర్ధంతి సందర్భంగా మాధవీలత కుమార్తెలు వృద్ధులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

అనాథ వృద్ధులకు అన్నదానం

వేంపల్లె : వేంపల్లెలోని స్థానిక పాత గండిరోడ్డులో ఉన్న మధర్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో అనాథ వృద్ధులకు అన్నదానం చేశారు. బుధవారం స్థానిక సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు జన్మదిన వేడుకల సందర్భంగా అన్నదానంతో పాటు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే స్థానిక రాజీవ్ నగర్ కాలనీలోని అనాథ వృద్ధులకు అన్నదానం చేశారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించడం అన్యాయం



మాట్లాడుతున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

పులివెందుల రూరల్ : కూటమి ప్రభుత్వం.. ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేసి దుకాణాలలో ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న వారిని తొలగించడం అన్యాయం అని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ మద్యం దుకాణాలను ఏర్పాటు చేసి వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు. కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలను రద్దు చేసి దుకాణాలలో ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న వారిని తొలగించి రోడ్డున పడేటట్లు చేసిందన్నారు. కూటమి వంద రోజుల పాలనలో రాష్ట్రం అథోగతి పాలైందన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల పర్యటనలో భాగంగా బుధవారం క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు శ్రీకాంత్, భాస్కర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

టపాసుల వ్యాపారస్తులు నిబంధనలు పాటించాలి



టపాసుల దుకాణాలను తనిఖీ చేస్తున్న సీఐ నరేశ్‌బాబు

ఎర్రగుంట్ల : దీపావళి పండుగ సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన టాపాసుల దుకాణాల వ్యాపారస్తులు నిబంధనలు పాటించాలని పట్టణ సీఐ నరేష్‌బాబు తెలిపారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన టాపాసుల దుకాణాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతి దుకాణానికి రెండు అగ్ని మాపక సిలిండర్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. బకెట్లలో ఇసుకను, డ్రమ్ముల్లో నిండుగా నీళ్లు ఉంచుకోవాలన్నారు. నాణ్యమైన బాణ సంచాను విక్రయించాలన్నారు. పండుగ ముగిశాక మిగిలిన బాణ సంచాను అగ్నిమాపక శాఖ అధికారులు ఎంపిక చేసిన గోదాముల్లో బద్రపరచాలన్నారు.

సస్యరక్షణతోనే అధిక దిగుబడులు సాధ్యం



రైతులకు సూచనలిస్తున్న ఏఓ శివమోహన్‌రెడ్డి

సింహాద్రిపురం : రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టినప్పుడే అధిక దిగుబడులు సాధ్యమవుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి శివమోహన్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని రావులకొలను గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది రబి సీజన్‌లో సాగు చేసిన పంటలకు సంబంధించి ప్రీమియం చెల్లింపు త్వరలోనే ప్రభుత్వం నిబంధనలను విడుదల చేయడం జరుగుతుందన్నారు. రైతులు తాము సాగు చేసిన పంటలకు తప్పనిసరిగా ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు దీపిక, సర్పంచ్ మహేశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పంటల సాగులో విత్తన శుద్ధి తప్పనిసరి

పులివెందుల రూరల్ : పంటల సాగు చేసేముందు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ నాగలక్ష్మి రైతులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని రాగిమానుపల్లె, ఎర్రగుడిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు శనగలు విత్తుకునే ముందు కచ్చితంగా విత్తన శుద్ధి చేసుకోవడంవలన వేరు కుళ్ళు తెగుళ్లు రాకుండా కాపాడుకోవచ్చునన్నారు అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వేప నూనె, కానుగ నూనె కలిపి పిచికారి చేసుకోవడంవలన రసం పీల్చే పురుగులు పంటలకు ఆశించవన్నారు.

రసాయనిక ఎరువులు వాడవద్దు

లింగాల : పంటల సాగులో రసాయనిక ఎరువులు వాడటంవల్ల నాణ్యతలేని పంట ఉత్పత్తులు పండిస్తున్నారని మండల వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. బుధవారం మండలంలోని ఇప్పట్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, అనుబంధ శాఖలు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ భావి తరాలకు మంచి నేల, మంచి ఆహారం అందించాలంటే, ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంపైన అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి తప్పనిసరి

వేముల : పంటల సాగు చేసే రైతులు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని ఏఓ చెన్నారెడ్డి తెలిపారు. మండలంలోని నల్లచెరువుపల్లె రైతు భరోసా కేంద్రంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ శనగ సాగులో నూతన యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చునన్నారు. వీఏఏ సుదర్శన్ రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి

కమలాపురం : రైతులు తాము సాగు చేస్తున్న పంటలకు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని మండల ఏఓ సరస్వతి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని నల్లింగాయపల్లె, తురకపల్లె గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది.. కార్యక్రమంలో ఆమె మినుము, శనగ, ఉల్లి, వేరు శనగ తదితర పంటల సాగులో రైతులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్రారెడ్డి, వీఏఏ వెంకటేశ్వరీ, రైతులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి సరిగా చేయాలి

పెండ్లిమర్రి : రబీలో పంటలు సాగుచేసే రైతులు విత్తన శుద్ధి తప్పని సరిగా చేయాలని వ్యవసాయాధికారి ఓబులేసు తెలిపారు. బుధవారం మండలంలోని రంపతాడు, ఎగువపల్లె గ్రామ పొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట సాగు చేసే ముందు రైతులు ఒక కేజీ విత్తనాలకు 10 గ్రాములు ట్రికోడెర్మావిరిడి కలిపి విత్తన శుద్ధి చేయాలన్నారు. వీఏఏ అశోక్, రైతులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వీరపునాయునిపల్లె : మినుము, పెసర పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి శ్యామ్‌బాబు తెలిపారు. బుధవారం మండలంలోని ఎస్.పాలగిరి గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రస్తుతం సాగులో ఉన్న మినుము, పెసర పంటలను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వర్షం అధికంగా పడటంతో మినుము, పెసర పంట ఆకులు పసుపు వర్ణంలోకి వచ్చాయన్నారు. దీని నివారణకు 19:19:19కిలో ఎరువు ఎకరాకు పార్ములా 4ను 2గ్రాములు లీటరు నీటిలో కలిపి పంటపై పిచికారి చేయాలన్నారు. తద్వారా పోషకాలు మొక్కలకు అంది పంట పెరుగుదలకు దోహద పడుతుందన్నారు. వ్యవసాయ సహాయకులు ప్రసాద్ పాల్గొన్నారు.